International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.5, Issue-7, July, 2018
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

# తెలుగు సాహిత్య చరిత్రలో – స్త్రీవాద కవిత్వోద్యమం

శ్రీమతి ఎస్.రాధా రమణ
తెలుగు శాఖాధిపతి
కె.జి.ఆర్.ఎల్. డిగ్రీ కాళాశాల(స్వయం ప్రతిపత్తి), భీమవరం
పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

తెలుగుసాహిత్యం క్రీ.శ. 11వ శతాబ్దంలోనే ప్రారంభమైనప్పటికీ, స్త్రీల గొంతు వినబడడం క్రీ.శ. 20వ శతాబ్ధంలోనే ప్రారంభమైంది. 15వ శతాబ్ధిలో తాళ్ళపాక తిమ్మక్క నుంచి 19వ శతాబ్దంలో తరిగొండ వెంగమాంబ వరకు చెదరు మదురుగా కవయిత్రులు కనిపిస్తారు. ప్రాచీన సాహిత్యంలో కవయిత్రులు తమ సమకాలీనులైన పురుషుల కవిత్వ మార్గానే అనుసరించారు. తమ సొంత మార్గాన్ని అన్వేషించే ప్రయత్నం చేయలేదు. అభ్యుదయ ఉద్యమాల్లో కవయిత్రుల సంఖ్య పరిమితంగానే ఉన్నా, ఆ కవిత్వంకూడా సొంత గొంతుకతో వచ్చిన కవిత్వమే.

సంస్కరణోద్యమం స్త్రీలలో రావలసిన చైతన్యాన్ని సూత్రప్రాయంగా చెప్పింది. కాల్పనిక ఉద్యమం స్త్రీలను కొత్త రూపంలో దర్శించింది, అభ్యుదయ కవిత్వోద్యమం స్త్రీ, పురుష సమానత్వం గురించి పాక్షికంగానైనా ప్రస్తావించింది. అయితే ఈఉద్యమాలేవీ స్త్రీ సమస్యలకు కారణమైన పితృస్వామ్యవ్యవస్థ స్వరూప, స్వభావాలను అర్ధం చేసుకోలేదు. అధ్యయనం చేయ లేదు, ఆకారణంగా స్రీల చైతన్యం గురించిన వారి అవగాహన అసంతృప్తిగా ముగిసింది.

తెలుగు సాహిత్యంలో జాతీయోద్యమ, అభ్యుదయ, విప్లవ కవితా ఉద్యమాల తర్వాత అత్యంత ప్రభావంచూపిన ఉద్యమం స్త్రీవాద కవిత్వోద్యమం 1975 తరువాత రూపుదిద్దుకొని 1985 నుండి స్థిరపడి క్రమంగా అన్ని ప్రక్రియలకు విస్తరించిన ఉద్యమం స్త్రీవాద కవితోద్యమం.

ఆంగ్లంలో 'ఫెమినిజం' అన్న పదానికి సమానార్ధకాలు స్త్రీ విముక్తి అని, స్త్రీ స్వేచ్ఛా ఉద్యమం అనీ, స్త్రీ విమోచనోద్యమం అన్నీ రకరకాల పేర్లు వాడుకలో ఉన్నా, వీటన్నీటి తరువాత వచ్చిన స్త్రీవాదం అన్నదే ఈనాడు ప్రచారంలో వున్నది.

**స్త్రీవాదం నిర్వచనం:-**

ఫెమినిస్టు స్టడీ సర్కిల్ స్త్రీవాదానికి ఇచ్చిన నిర్వచన మేమిటంటే ! సమాజంలోను, కుటుంబంలోనూ, పనిలోను స్త్రీలు గురౌతున్న అణచివేత, దోపిడీకి సంబంధించిన, అవగాహన కలిగివుండి, ఈ పరిస్థితి మార్చడానికి స్త్రీ పురుషులు చేపట్టే చైతన్యవంతమైన కార్యక్రమం.

**స్త్రీవాదం నేపధ్యం:-**

ఇక స్త్రీవాదం దాని నేపద్యం గురించి పరిశీలించినట్లయితే తెలుగులో స్రీవాద సాహిత్యోద్యమం 1970 దశకం వరకూ రూపుదిద్దుకోనప్పటికీ, ప్రపంచ వ్యాప్తంగా ఇది సామాజిక ఉద్యమంగా ప్రారంభమై 200 సంవత్సరములు దాటింది.

1. 1870 రష్యన్ విప్లవం వ్యక్తి స్వాతంత్రాన్ని చర్చిస్తున్నప్పుడు స్త్రీ విముక్తికి ప్రాధాన్యమిచ్చింది.
2. 1889లో పారిస్‌లో జరిగిన అంతర్జాతీయ సమావేశంలో స్త్రీ పురుషుల సమాన హక్కుల ప్రస్తావన వచ్చింది.
3. 1911 నాటి చైనా విప్లవంలో స్త్రీలు కార్మిక పోరాటాల్లో పాల్గొన్నారు.

ఓటు హక్కు, విద్యాహక్కు, ఎన్నికల్లో పోటీచేసే హక్కు గర్భస్రావం హక్కు, వీటన్నిటినీ ప్రపంచ స్త్రీలు పోరాటాల ద్వారా సాధించారు.

ఈ సామాజిక ఉద్యమంతోపాటు కొందరు స్త్రీల రచనలు కూడా భారతదేశంలో స్త్రీవాద ఉద్యమానికి ప్రేరణనిచ్చాయి. వీటిలో ముఖ్యంగా చెప్పుకోదగినది 1792లో ఇగ్లండు రచయిత్రి మేరీ హాల్‌స్టోన్ క్రాఫ్ట్ రచించిన "విండికేషన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ విమెన్" స్త్రీల హక్కుల గురించి, కుటుంభ వ్యవస్థ పరిమితుల గురించి చర్చించిన మొట్టమొదటి పుస్తకం ఇది ఫ్రెంచి రచయిత్రి రచించిన "ది సెకండ్ సెక్స్" 1960 లో అమెరికన్ రచయిత్రి బెట్టి ఫ్రీడన్ రచించిన "ది ఫెమినైన్ మిస్టిక్" తెలుగులో స్త్రీవాదం కవిత్యోద్యమాన్ని ప్రభావితం చేసిన రచనలు.

స్త్రీవాద ఉద్యమం ప్రపంచ వ్యాప్తంగా సామాజిక ఆర్థిక రాజకీయ హక్కుల పోరాటంగా ప్రారంభమై, క్రమేపి సాహిత్యంలో విశిష్టంగా ప్రతిధ్వనించింది.

**స్త్రీవాద కవిత్వం :-**

స్త్రీవాద కవిత్వంలోని ప్రధాన వస్తువులను ఇలా చెప్పవచ్చు.

| | | | |
|---|---|---|---|
| 1. | వ్యక్తిగా తన వునికి | 5. | కుటుంభంలో హింస |
| 2. | మాతృత్వం | 6. | శారీరక స్పృహ |
| 3. | లైంగిక వివక్ష | 7. | సామాజిక జీవితం |
| 4. | వివాహవ్యవస్థ | 8. | ప్రపంచీకరణ |

**(1) ఉనికి :**

స్త్రీగా పుట్టడమే శాపమని భావించేలా ఈ పితృస్వామ్య వ్యవస్థ చేస్తుంది. కనుక తన ఉనికే నిషద్ధమని చెబుతూన్న ఈ కవిత:

"నేనమ్మలో ఉన్నప్పుడు,
నేను కావాలని అమ్మ కోరుకుంటున్నట్లు
నాన్నకు తెలియగానే
ఈడ్చి చెంపపగలకొట్టిన నాన్న దెబ్బకి
నేనెవర్నో తెలిసింది.
నేనొక స్త్రీని
నేనొక నిషిద్ధ జీవిని
మొన్నటిదాకా నా నవ్వునిషిద్ధం
నిన్ననా చదువు నిషిద్ధం
నేడు నా బ్రతుకు కూడా నిషిద్ధమే"

గర్భశిశువులుగా ఉండగానే మొగ్గలోనే తుంచివేయబడుతున్న స్త్రీ అస్థిత్వానికి ఒక మచ్చుతునక ఈ కవిత.

**(2) మాతృత్వం :**

అలాగే మాతృత్వ విషయానికి వస్తే మాతృత్వంలోని ఆనందాన్ని అంగీకరిస్తూనే స్త్రీల నిర్దయాలతో అభిప్రాయాలతో ప్రమేయంలేని మాతృత్వ స్థితిని స్త్రీవాద కవయిత్రులు అద్భుతంగా చిత్రించారు.

వసంత కన్నాభిరాన్ 'శరీరం' అనే కవితలో
"దరిద్రుడు బిడ్డలతో నాశరీరాన్ని పుచ్చింది,
తన జాతిని కొనసాగిస్తే
ధనికుడు మరిన్ని మందులతో
నాగర్భాన్ని ఎడారిలా ఎండగడుతున్నాడు".

**(3) లైంగిక వివక్ష :**

పుట్టిన తరువాత, ఆడపిల్ల వృద్ధాప్యం వచ్చేవరకు ఎలాంటి నియంత్రణలో, నిర్లక్ష్యంలో, చులకనలో బతుకుతుందో ఈ చిన్న ఉదాహరణ చాలు.

బాల్యంలో..
చిన్నపిల్లని నీకేంతెల్సు కూర్చో అన్నారు
యవ్వనంలో..
ఉడుకు రక్తం మంచీ, చెడూ తెలీదు కూర్చో అన్నారు.
వృద్ధాప్యంలో..
ముసల్దానివి ఇంకేం చేస్తావ్ కూర్చో అన్నారు.

అవకాశం రానందుకు కోపంగా లేదు. నాకు, కూర్చొని, కూర్చొని బద్ధకం వచ్చినందుకు బాధగావుంది. ఈ విధమైన లైంగిక వివక్షతో పాటు వివాహ వ్యవస్థకూడా స్త్రీ అణచివేతకు కారణమైంది.

**(4) వివాహ వ్యవస్థ :**

వివాహం, దాంపత్యం అనే పదాలకున్న ఊహాజనితమైన, ఆదర్శప్రాయమైన అర్థాలు, వాస్తవిక జీవితంలో ఎక్కడా సరిపోలవని స్త్రీవాద కవిత్వం స్పష్టం చేసింది.

వివాహానంతరం స్త్రీ ఎన్నిరకాల అవతారాలు ఎత్తవలసి వస్తుందో చెప్తూ...

"కుక్కర్ విజిల్స్‌లోనే
మనోజ్ఞ సంగీతం వింటాను
పతిదేవుని టేబుల్ పై కాఫీ కప్పుగా ఉంటాను
పిల్లల మీల్స్ కారియర్‌గా, లంచ్ బాక్సులుగా
బహు పాత్రాభినయం పోటీలో
నాచేతులకెప్పుడూ ఫస్ట్ ప్రైజే"

**(5) కుటుంబ హింస :**

కుటుంబంలో స్త్రీ నిర్వహించవలసిన అనేక పాత్రలు, ఆమెపై వాటి ప్రభావాలు, స్త్రీవాద కవితకు ప్రధాన వస్తువులయ్యాయి. ఇంటి చాకిరి స్త్రీ జీవితాన్ని ఎలా పరిమితం, సంకుచితం చేస్తుందో, ఆమె అస్థిత్వాన్ని ఎలా హరిస్తుందో విమల తన వంటిల్లు కవితలో అద్భుతంగా వర్ణించింది. వంటింటిలో స్త్రీ బాల్యం ప్రారంభమౌతుందని చెప్తూ...

మాఅమ్మ అమ్మమ్మ
ఇంట్లో అమ్మలంతా ఇక్కడే "స్త్రీ" లయ్యారట
భయం భయంగా నిశ్శబ్దంగా నిరాశగా
మా అమ్మొక ప్రేతంలా తేలుతూ వుంటుందిక్కడ
ఈ వంటింటి సామ్రాజ్యానికి మా అమ్మే రాణి
అయినా చివరకు వంటింటి గిన్నెలన్నింటిపైనా మా నాన్న పేరే

**(6) సామాజిక జీవితం :**

ఇంటినుంచి బయటకు వచ్చిన స్త్రీ ఎదుర్కొనే సమస్యలు, పురుషాధిక్యసమాజం వారిని కించపరచి అవమానించి అణచివేసే విధానాలు స్త్రీవాద కవిత్వానికి కవితావస్తువులయ్యాయి.

సమాజంలోని అన్ని వర్గాల పురుషులకూ స్త్రీ ఎలా పెట్టుబడి అవుతుందో మందరపు హైమావతి చెబుతుంది.

కవికీ, చిత్ర కారుడికీ
నాశరీరమేకదా
వర్ణనీయవస్తువు,
చలన చిత్రాలకు
వ్యాపార ప్రకటనలకు
పెట్టుబడి నా శరీరమే కదా.

**(7) ప్రపంచీకరణ :**

మారుతున్న సామాజిక, ప్రాపంచిక జీవితాలతోపాటు, తమ-అవగాహనా పరిధిని, అనుభవాల పరిధిని విస్తృతం చేసుకొని కొత్త వస్తువులను ఎప్పటికప్పుడు స్వీకరించడం ఈ కవయిత్రుల రచనలోని వైశిష్ట్యం. సామ్రాజ్యవాద దేశాలు, భారతదేశం వంటి వర్ధమాన దేశాలను ఎలాంటి ప్రలోభాలకు గురిచేస్తున్నాయో, వాటిని అనుకరిస్తూ మనం ఎంత అసహజంగా జీవిస్తున్నామో ఈ కవితలో నిర్మల అద్భుతంగా ఆవిష్కరించింది.

"మొగ్గల్లోంచి పువ్వు బయటకొచ్చినంత సహజంగా
నోట్లోంచి మాట రావడం మానేసింది.
చెమట చర్మం మీదికి రాకుండా
ఫౌండేషన్ క్రీమ్ కాపలా -
కంటి చెమ్మ రెప్పకు తెలీకుండా
కప్పుకొన్న బలాష్ కాపలా -

పెడిక్యూర్ అనుకుంటూ
పరాయి మార్కెట్ పాదసేవకు
చేతులిచ్చిన దాసిని నేనే"

ఈ విధంగా మధ్య తరగతికి చెందిన, నగరవాసుల స్వీయానుభవాలలో ప్రారంభమైన స్త్రీవాద కవిత్వం పద్మ, విమల వంటి వారి శ్రామిక వర్గ స్త్రీల ఆత్మ ఘోషను, చల్లపల్లి స్వరూపరాణి మద్దూరి విజయశ్రీ మొదలైన వారు దళిత స్త్రీలు ఎదుర్కొనే హింస చిత్రించారు.

స్త్రీవాద కవిత్వం 85-95 దశకంలో విస్తృతంగా వెలువడుతున్నప్పుడు సమకాలీన విమర్శకులనుండి తీవ్ర విమర్శను ఎదుర్కొనవలసి వచ్చింది, సొంతగోడుగా, అగ్రవర్ణాల స్త్రీల ఫ్యాషన్‌గా, ప్రయోజన రహితమైన సాహిత్యంగా దూషించిన విమర్శకుల్లో ముఖ్యులు జ్వాలా ముఖి, అద్దేపల్లి రామ్మోహనరావు కాగా ఈ కవిత్వాన్ని సమర్థిస్తూ చేకూరి రామారావుగారు, రావి ప్రేమలత మొదలైనవారు.

స్త్రీవాద కవిత్వం పుట్టి పాతికేళ్ళుపైగా గడిచాయి. స్త్రీవాదుల పోరాటం పురుషులపైన కాదని, పురుషాధిక్య ప్రపంచంపైనేనని, పాఠకులకు, విమర్శకులకు విడమర్చి చెప్పడంలో ఈ కవయిత్రులు కృతకృత్యులవుతున్నారు. స్త్రీ పురుషుల మధ్య ఆదిపత్య, అధికార సంబంధాలు పోయి, పరస్పర గౌరవించుకునే సమస్థాయి సంబంధాలు ఏర్పడాలన్నదే తమ లక్ష్యమని స్త్రీవాద కవిత్వం నిరూపించింది.